ఓం నమో విఘ్నరాజాయ
సర్వసౌఖ్యప్రదాయినే
దుష్టదారిద్ర్య వినాశాయ
పరాయ పరమాత్మనే
లంబోధర మహావీర్యం
నాగయజ్ఞోపశోభితమ్
అర్ధచంద్రధరం దేవం
విఘ్నవ్యూహ వినాశనమ్

# గణేష్ గానామృతమ్

(2011 ఆగష్టు 14న సి.డి. ఆవిష్కరణ)

పల్లవి : శరణం శరణం గణేశాయ

చరణాలు శరణం మహేశాయపుత్ర!

చరణాంబుజ యుగళంబుస్మరియించెద ॥శ॥

1. ధవళాంబరధారివి - భక్త జనవిహారివి

కుబ్జరూపధారివి - ఏకదంత వదనానివి

చరణాంబుజ యుగళంబు స్మరియించెద ॥శ॥

2. కైలాసవాసివి - కైవల్యదాతవి

కారుణ్యమూర్తివి - కరుణించువాడివి

గిరిజాసుతుడవు - సిద్ధులయిలవేల్పువి

చరణాంబుజయుగళంబు స్మరియించెద ॥శ॥

# గణేష్ గానామృతం

పల్లవి: కాణిపాక స్వామీ కరుణించు స్వామీ
నాపాపహరణంబుకావించు స్వామి ॥కా॥

1. బ్రతుకు బండిని లాగలేక
కష్టాల కడలిని ఈదలేక
విసిగి వేసారి పోయాను
నీమీద ఆశతో నిలిచియున్నాను ॥కా॥

2. అడ్డంకు లెన్నున్న తొలగించు స్వామి
జీవిత ఆశనే రగిలించు స్వామి
బుద్బుదప్రాయమీ బ్రతుకున
చిరుదీపమైనా వెలిగించు స్వామి ॥కా॥



# సాక్ష్యం (వచన కవిత)

చిగురించిన మావికొమ్మకు
చిన్నారి కోకిలమ్మ సాక్ష్యం
వర్షించు స్వాతి చినుకుకు
మెరిసే ముత్యం సాక్ష్యం

గగనానవున శశికి
మెరిసే తారక సాక్ష్యం
సంద్రానవున్న నీటికి
ఎగిసిపడే అలలు సాక్ష్యం

కళ్ళల్లో పుట్టే కలలకు
కంటిపాప సాక్ష్యం
మనసులో మెదిలే ఆశలకు
గుండెసవ్వడి సాక్ష్యం

ఆమనికి ప్రాణం కోకిలమ్మ స్నేహం సాక్ష్యం
కవికలానికి స్నేహం
ఆమనిరాకే సాక్ష్యం

# అమ్మా! నన్ను క్షమించు

70 వసంతాల క్రితం నన్నీ భూమ్మీదకు తెచ్చిన అమ్మా.......
నన్ను క్షమించు
నేను పుట్టేననే ఆనందంతో మెరిసే నీకళ్ళల్లో....
కన్నీటి ముళ్ళు మొలిపించానమ్మా!
గోరు ముద్దలు తినిపించిన నీ నోటికి
క్రొత్త రుచులు పరిచయం చేయలేక పోయాను
రాగద్వేషాలంటకుండా పెంచిన నిన్ను
కోడల్ని సాధిస్తున్నావేమోనని అనుమానించానుకదమ్మా!
నాన్నకు తద్దినం పెట్టిన రోజున
ఒకలీవు పోయిందే ఆదివారం వస్తే బాగుండునన్నప్పుడు
నాన్న ప్రతిబింబంతో నిండిన నీమనసు
ఎన్నిముక్కలైయుంటుందో పూహించలేకపోయాను
ఒక జీవితకాలం నాకోసం వెచ్చించిన నీ పవిత్ర పాదాలకు
ఒక్కసారి...ఒకసారి కూడా మోకరిల్ల లేకపోయాను
కంటికి రెప్పలా కాపాడిన నిన్ను....
నాయింటి కావలి కుక్కను చేశాను కదమ్మా!
అందరి ముందు గెలవాలిరా అన్న నీముందు
మరుగుజ్జునై ఓడిపోయాను
అమ్మా! నన్ను క్షమించగలవా?!



# మేరా భారత్ మహాన్

అదుపు తప్పుతున్న నేటి సమాజంపోకడ...
పట్టాలు తప్పిన రైలుబండి
దేశం దేహానికి ఎన్నో తూటాలతూట్లు
ఒకటా..రెండా...అకారాది పదాలమయం.
అవినీతి...అధర్మం...అన్యాయం....అరాచకం
ఇలా.,..ఇలా.....ఎన్నో...ఎన్నెన్నో.....
"నిజమే – మేరా భారత్ మహాన్" అని నినదించడమే కాని
నిలకడేది నిలపడానికా పేరు?
సోదరా!
దేశంలో నీతికోసం వెదకుతున్నావా?
అది ఆఫీసులో బల్లల కింద అవినీతి చేతుల మధ్య
చిక్కుకుంది వెళ్ళిపట్టుకో
ధర్మం భూకబ్జా చేసే బడా బాబుల చేతుల మధ్య
చిక్కుకుంది బయటకు లాగుదాంపద
న్యాయం పారిపోతోంది న్యాయ స్థానం కాంపౌండులోంచి
దాన్నాపుదాంపద
అరాచకం ఉగ్రవాది పట్టుకున్న ఎ.కె.47 రైఫిల్స్ చేతిలో
ఇమిడిపోయింది.
తొందరపడకు ముందుపాతరుండ వచ్చు దారిలో
అదను చూసి మీదపడదాం
దేశంలో ఎవడికి గ్యారంటీ లేదు రేపు సూర్యోదయం చూస్తామని
ఇక యిప్పుడు కాన్వెంట్లకు పోయే బుడతల్ని చూడు

చదివేది ఎల్.కె.జి మోసేది 10కె.జి
చేతిలో కేరేజీ వాటర్ బాటిల్ లీకేజీ
ఇది ఈతరం పసిపిల్లల దీనావస్థ
పేరెంట్లు ఓవరేంబిషన్ వ్యవస్థకు
ఇంటర్నెట్ల హంగామాల మధ్య...
నలిగిపోతున్నాయ్ – పసి హృదయాలు
నేటి భారతదేశపటం ఛిద్రమైన సంస్కృతీ తెరపై కనబడుతోంది
ఇక కైమోడ్పులు మానేయ్ సోదరా!
కరదండలు సృష్టించి కదలుదాం
దేశాన్ని సంస్కరిద్దాం
అందరం జూలు విదల్చిన కవిసింహాలౌదాం
అప్పుడు... అప్పుడు...
నినదిద్దాం! మేరాభారత్ మహాన్ అని.

*(2009లో పాలకొల్లులో పురస్కారం పొందిన కవిత)*



# దగ్ధగీతం

**(తెలంగాణా గొడవల నేపథ్యం)**

అన్నదమ్ముల మధ్య చిచ్చురేపిన...
చిదంబర రహస్యమేమిటో?
నిన్నటి దాకా గుబాళించిన పూలవనం... దగ్ధమౌతోంది
రేపటికి మిగిలేది అస్థిత్వాల అస్తికలేనేమో!
ఏ ప్రాంతంలో కాలు మోపినా భూమి మండుతోంది
ఎక్కడ అడుగుమోపినా భయం భూతం వెంటాడుతోంది
రాష్ట్రంలో మనుష్యులు పగలు అతికించుకున్న దృశ్యాల్ని
రాత్రి స్వప్నాల్లో రీళ్ళుగా చుట్టుకుంటూ ఉలిక్కిపడి నిద్ర లేస్తున్నారు
నిద్ర లేవగానే నిరాశ దుప్పట్ని కప్పుకొని
బిక్కుబిక్కుమంటూ చూస్తున్నారు.
కుల వివక్ష – లింగవివక్ష – జాతి వివక్ష...
ఈ వివక్షలన్నీ విభజనరేఖల్ని గీస్తున్నాయ్.
ఆ గీతల్ని దాటి...
సంకుచితత్వాన్ని సముద్రలోతుల్లోకి విసిరిపారేద్దాం
విశాలత్వాన్ని వినీలాకాశంలో నాలుగుచెరగులా విస్తరింపచేద్దాం
విశ్వమానవసౌభ్రాతృత్వం – వసుధైక కుటుంబం
ఈ పదాల్ని పదిలంగా గుండెలోతుల్లో దాచుకుందాం

# కరుణా క్లబ్ (చెన్నై) వారు వ్రాయించుకున్న గీతం

పల్లవి : సకల జీవరాశిపై కరుణ నీవు చూపాలి
సమత మమత ఘనత నీవు సాధించాలి... ॥సకల॥

1. తరతమ బేధం లేదు భగవంతుని దృష్టిలో
ప్రతివ్యక్తికి పరమార్థం బ్రతుకే కద సృష్టిలో ॥సకల॥

2. సహనం - సహజీవనం సంఘజీవి లక్షణం
మూగ జీవరాశికి సేవ చేయి తక్షణం ॥సకల॥

3. పంచేంద్రియాల నీవు అదుపులో నుంచుకో
సుజనమైత్రి పొంది నీవు కరుణసేవపంచుకో ॥సకల॥

4. మెతుకు లేక బ్రతుకీడ్చెడి పేద వాడినాదుకో
భగవంతుని కృపాకటాక్షాల నీవందుకో ॥సకల॥



# గురుపాదాభివందనం

(2005లో గురుపూజోత్సవ సందర్భంగా వ్రాసిన గీతం)

పల్లవి : వందనం - వందనం - అభివందనం
గురుదేవుల పాదాలకభిచందనం ॥వందనం॥

1. చదువు - సంస్కారం
చదువులమ్మ నేత్రాలు
మాబడి తోటలో వికసించిన కుసుమాలు
వాటిని మాకందించి పూబాటను చూపిన
మా గురుదేవుల కభివందనం ॥వందనం॥

2. అజ్ఞాన తిమిరాన్ని తరిమేటి జ్యోతులు మా గురుదేవులు
విజ్ఞాన ధనమును పంచే మహాదాతలు
బంగారు భవిత నందించే విధాతలు
కొవ్వొత్తిలా కరిగిపోతూ జ్ఞానకాంతి నింపే...
మా గురుదేవులకిదే అభినందనం ॥వందనం॥

# బంతి

విసిరేసిన విస్తరాకుల్ని కప్పుకొని చెత్త కుండీలో
నివురుగప్పిన నిప్పులా దాక్కొంది ఓ పసితనం
వడ్లగింజ నోట్లో పడేసి చంపకుండా
ఓ కసాయి తల్లి కడుపు తీపి అడ్డు వచ్చింది కాబోలు
విసిరి పారిపోయింది.

ధర్మం రెండు పాదాల నడిచిన ద్వాపరంలో
కానీనుడిగా పుట్టి నీటిపాలైన కర్ణుడికే దిక్కులేదు మొదట్లో
ఘోర కలితో నిండిన కలియుగంలో
తానొక లెక్కా అనుకుంది ఆ పసితనం
ఏ యిద్దరో చేసిన పాపానికి తాను బలైపోయానని...
వాపోయిందా పసితనం.

శీతలానికి గడ్డకట్టిన మంచుముక్క బలపంతో...
చీకటి పలకపై తనదీన గాథ రాద్దామనుకుంది పెద్దైతే
కన్నవాళ్ళూ, దొరికినవాళ్ళూ – అమ్ముకున్నవాళ్ళ...
చేతుల్లోంచి జారిపడిదొర్లుతూ... దొర్లుతూ...
ఎక్కడ ఆగుతుందో మరి బంతిలాంటి పసితనం



# "ఓ రాక్షసీ! నీపేరు రాజకీయమా?"

మనిషి పుట్టుక మంచిదే – పెరిగే కొలదీ మనసుకు లొంగిపోతాడు
కానీ... మనసును మనిషి తన గుప్పిటనుంచుకుంటే...
మనిషి ... మనీషౌతాడు
అదే కొరవడిందీనాడు మనిషిలో
పదవీ కాంక్షకు బానిసై రాజకీయ రంగంలో పావుగా...
మారిపోతున్నాడు
పాప పుణ్యాలు మరచిపోతున్నాడు
ఓరాక్షసీ! నీ కబంధ హస్తాలలో మనిషినిరికించుకొని
రక్తదాహం తీర్చుకుంటున్నావ్
పదవికి పరుగెత్తే ప్రబుద్ధులు ప్రలోభం సాలెగూటిలో..
చిక్కి గిలగిలలాడుతున్నాడు
సంఘాన్ని విలవిల లాడిస్తున్నాడు.
రాజకీయానికి మరోపేరు స్వార్థం
ప్రజాసేవ చేస్తాననడం వ్యర్థం
స్వార్థం నిండిన మనసులో దేశ సేవన్నది ఎండమావి.
వదిలిపెట్టు మనిషిని రాజకీయమా!
మనిషిని మనిషిగా జీవించనీ
మనసును మనసు ప్రేమించనీ
బ్రతికిన్నాళ్ళూ మంచిగా బ్రతకనీ
మానవత్వాన్ని మనిషి వెదకనీ!

# ఆశ

## (శుక్ల ఉగాది కవి సమ్మేళనంలో చదివిన కవిత : 7-4-1989)

విభవ వెళ్ళింది కన్నీటిని మిగిల్చి
దారుణ మారణహోమం రగిల్చి
ద్వితీయ సంవత్సర అద్వితీయంగా జీవితాలు...
సాఫీగా సాగిపోతాయని ఆశించి
ఘనంగా – ఆప్యాయంగా స్వాగతిస్తున్నాను ఆశతో
ఆనాటి ఉగాది పచ్చడిలో చేదు ఎక్కువైంది
అందుకే జీవితంలో చేదు అనుభవాల్ని మిగిల్చింది.
హత్యా రాజకీయ యజ్ఞానికి..
అమాయకులు సమిధలైపోయారు.
ఆస్తులు కోల్పోయి విభవలో హతాశులైపోయారు.
అయినా... ఆనవాయితీ తప్పదు కనుక ఘనవీడ్కోలిస్తున్నాను
విభవకు
శుక్ల వర్షానికి హర్షంతో స్వాగతం చెపుతున్నాను ఆశతో
తీపి అనుభూతులు మిగల్చాలని ఆశిస్తూ..
కానీ...
హింసాయుత జీవనం సాగించే కర్కశులు...
తమ చేతికంటిన రక్తం మరకల్ని కడిగేస్తున్నారు పావన
కృష్ణా, గోదావరీ తరంగిణుల్లో...
ఆ నీరావిరై... ఆకాశంలో మేఘాలై...
అరుణారుణ పంకిలమై వర్షిస్తున్నాయ్ రక్తవర్ణ తుషారాలు
అందుకే వాటిని చూస్తూ ఎగిరొచ్చే ఎలకోయిల....
భయపడి వెనక్కి వెళ్ళిపోయుండాలి.



# "కిం కర్తవ్యం"

దేశంలో యిప్పుడు ఎక్కడ పాదం మోపినా...
భూమి మండుతోంది.
ఎక్కడ అడుగుపెట్టినా భయం భూతం వెంటాడుతూంది.

దేశంలో మనుషులు పగలు అతికించుకున్న దృశ్యాల్ని...
రాత్రి స్వప్నాల్లో రీళ్ళుగా చుట్టుకుంటూ ఉలిక్కిపడి నిద్రలేస్తున్నారు...
నిద్ర లేవగానే నిరాశా దుప్పట్ని కప్పుకుని...
బిక్కుబిక్కుమంటూ చూస్తున్నారు.

ఎండిపోయిన లోతైన కళ్ళ బావుల సాక్షిగా
ఇప్పుడు దేశంలో ప్రవహిస్తూన్న ఏకైక జీవనది..
రైతుల కన్నీటి నదే.

తమ ఆకలి పేగుల సాక్షిగా... ఎంగిలిమెతుకుల చెత్తకుండీలో
దౌర్భాగ్యదేహాలు...
మన భావిభారత పౌరులదేహాలే!

మన దేశపటం ప్రపంచమేప్‌లో..
రూపాయి కప్పల్ని మింగి మింగి బలసిన డాలర్ కొండచిలువ
ఆవలింత లావుంది.

ఇప్పటికైనా మన చాపలక్రింద చేరిన నీరు సునామీలా
మారకముందే ప్రశ్నించుకుందాం 'కింకర్తవ్యమని'
సమాధానం కోసం వెదకుదాం

# ఎన్నికలలో..

కంటి పాపలకు రెప్పలతికించుకున్న ప్రతిమనిషీ కలలు కంటాడు
సామాన్యుడు కనే కలలు సాకారం చెందవు.
ప్రతీ స్వాతిచినుకూ ముత్యపు చిప్పలోపడదు...
ముత్యంలా మారదు
కానీ..
ఏ.సి. రూముల్లో పడుకున్న ధనవంతుడు ఖరీదైన కలలే కంటాడు
అవి సాకారానికి నోచుకుంటాయ్
ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది...
వసంతంలోనే గ్రీష్మం వచ్చేసింది
పూలతోటలో నవపల్లవాలు పొడసూపటంలేదు
వసంత కోకిల గానం వినబడటంలేదు
ఓట్లకోసం గీపెట్టే స్పీకర్లు డామినేట్ చేస్తున్నాయ్
అందుకే కోకిల పాడ్డం మానేసింది.



# ప్రకృతి చిత్రం

చల్లని గాలి వీచింది
మనసు నూయల నూపింది
ఊహల పక్షికి రెక్కలనిచ్చి నింగిపైకి ఎగసింది

1. కొండల కోనల్లోన... కోవెల కొలనుల్లోన
విరిసిన కలువలు ఫక్కున నవ్వి...
వెన్నెల వెలుతురునింపింది

2. సెలయేటి గలగలలు
జలధారల పరవళ్ళు
ఇది ప్రకృతి అందాలు
పులకించెను డెందాలు

3. చుక్కల చీరనుకట్టి
జాబిలి తిలకందిద్ది
కులుకుతు వచ్చెను యామిని కాంత
ఇది ప్రకృతి చిత్రపు వింత

## "షిరిడీ సాయి నమో... నమో" (గీతం)

**(2008 నవంబరు నెలలో ఆంధ్రభూమిలో ప్రచురింపబడినది)**

పల్లవి : అఖిల లోక సంసేవిత సాయీ
నిఖిల జనుల సంపూజిత సాయీ
అతులిత గుణ సంపేత సాయీ
సకలదైవ సారూప్యత సాయీ ||అఖిల||

1. సాయిబాబాయని సాయిదేవుడని
జగమున సకలము నీవని వేడె
భీతి లేదని అభయ మీయవా
జగతిని సుజనులు మొరవిడ బాబా ||అఖిల||

2. నాద వేదము పఠనము దేవా
నీదు స్తుత్యము వినిపించలేదా
అలల అలజడులు కడలికి సహజము
మనుజుల మథనము సహజమే కదా ||అఖిల||

3. మాటిమాటికిని కనుగొనలేము
మాదు వేదన ఘోష వినిపించలేద
రయమునవచ్చి చేయందించవా
భవిత తెలిసిన మహిమాన్విత దేవా ||అఖిల||

*(2009లో సాయిబాబా సి.డి. కొరకు వ్రాసినది)*



## "మట్టికణం"

పద ఘట్టనల్ని బట్టి పసికడుతుంది మట్టికణం
తన్ను తొక్కిన వాడు మనిషా? పశువాని
మట్టివాసన భరించలేని మనిషి
తనకు నెత్తుటి రంగు పులిమి
శవాలతో అణగతొక్కుతున్నాడని
కరకుతనం – కసాయితనం రాపిడి పొంది
శవాల్ని ప్రసవిస్తూ తన్ని మరీ అణగతొక్కుడున్నాడని
గ్రహించింది.

ఈ మధ్య మరీ ఎక్కువైంది అణగతొక్కడం మనిషి
పశువుగామారి
కసిపెంచుకున్న మట్టికణం తనని తొక్కిన
పాదాల్ని పట్టుకొని పడగొడదామనుకుంది.

కానీ... చలనం లేని మట్టికణం పరాధీన
అని పాపం నిర్వేదంతో పడుంది
మట్టికణం కంకణం కట్టుకుంటే...
గాలి నేస్తం తోడైతే...
నవరంధ్రాలు మూసి మనిషిని పడగొట్టొచ్చు
అనుకుంది మట్టికణం

*(2006 లో విజయవాడ హనుమంత*
*గ్రంథాలయంలో కవి సమ్మేళనంలో చదివిన కవిత)*

# మూగజీవుల వేదన

పల్లవి : దేవుడు సృష్టించాడు ప్రాణికోటిని
జాలివీడి హింసించకు జీవకోటినే...
మూగ జీవికోటిని
మేమే మూగజీవులం
మాపేరే జంతుజాలం ॥దేవుడు॥

1. పిడికెడు గడ్డి కూడా వేయకుండా
పిండుతారు మా పాలను కుండనిండా
ఒట్టినదని కటికవానికి అమ్ముతారు
పట్టిమాదు జీవాలను తీస్తారు ॥దేవుడు॥

2. మాకూ బ్రతకాలని ఆశలు తీరాలని
బిడ్డలసాకాలని మనసుంటుంది
మనసన్నది మాకున్నా పలుకన్నది లేకున్నా
కన్నవారిపై మాకూ మమతుంటుంది ॥దేవుడు॥

3. కఠినత్వం కరడు కట్టి
నరుడి వన్న మాట మరచి
ప్రాణులతో చెలగాటమాడవద్దు
మానవత్వం మంటకలిపి – కర్కశత్వమసినిపులిమి
జంతుజాతి సమిధలతో చలిమంటలను కాగవద్దు ॥దేవుడు॥

*(1974లో మీరూ ఆలోచించండి SPCA నాటికకు వ్రాసినది)*



# గరగపాట (మీరూ ఆలోచించండి)

సల్లని తల్లివి అమ్మోరమ్మా
సల్లంగ సూడుము మాయమ్మా!
అంకాలమ్మా! నూకాలమ్మా
సోమాలమ్మా! మాయమ్మా!
ఊరూరా నీపేరేదైనా
సల్లని తల్లివి నీవేనమ్మా!
మండాలమ్మా – నేరేళ్ళమ్మా!
పోలేరమ్మా ! పొలిమేరమ్మా!
పిల్లాపాపల సల్లంగ సూడు
దీవెనలిచ్చి కాపాడమ్మా
గరగసంబరాలు సేయిత్తాము
మొక్కుబడులనే తీరుత్తాము
ముత్యాలమ్మా గంగమ్మా
సల్లనితల్లివి అమ్మోరమ్మా
సల్లంగ సూడుము మాయమ్మా.. మాయమ్మా!

# మీరూ ఆలోచించండి

మనిషి మనసు స్వార్థం
దయలేని బ్రతుకు వ్యర్థం
సాగుతోంది కరకుదనం
కొనసాగుతోంది బలిదానం॥

నోరులేని ఈ కూన
కసాయి కత్తికి బలియేనా
ఇది మనిషి చేయుపాపం
అది జంతుతతికి శాపం॥

పాపం – పుణ్యం భేదం తెలియని మూఢుడు
ఈనాడతడే బలాఢ్యుడు
తప్పని చెబితే బెదిరిస్తాడు
దైవాన్నైనా ఎదిరిస్తాడు

జంతుబలులే మానండి
హింసమనకు తగదండి
ఇల ప్రాణులన్నీ సమానము
అను భావన దైవ సమానము

*(1974లో మద్రాసు నడగర్‌సంఘ్ థియేటర్లో వేసిన నాటికకు వ్రాసినది)*



# మానవతా! ఓ మానవతా!

ఎక్కడ... ఎక్కడ... మానవతా నీవెక్కడ?
మనిషిని మనిషి చంపేస్తుంటే
మమతల బంధాల్ని తెంపేస్తుంటే
మానవతెక్కడ కనిపిస్తుంది.

ఎప్పుడు సమతారాగం వినిపిస్తుంది
మనిషి గుండె లోతుల్లోన మనసు బండ బారింది.

నరమేధం జరిగే చోట
పరపీడన పెరిగే చోట
మానవతెక్కడ కనిపిస్తుంది
సమతా గీతం వినిపిస్తుంది.

యువత రుధిరం కాలువలై ప్రవహిస్తూంటే
భవితవ్యపు తిమిరం నల్దిక్కుల వ్యాపిస్తుంటే
మానవతెక్కడ కనిపిస్తుంది
ఎప్పుడు సమతా గీతం వినిపిస్తుంది.

చీకట్లో చిరుదీపంలా
మినుకుమినుకు మంటున్న మానవతా! మేలుకో
ఈ దేశాన్ని నువ్వేలుకో!...

# ఈ చరిత్ర... ఏసిరాతో...

గౌతమి ఒడ్డున ఏకాంతంగా కూర్చుని...
గతస్మృతుల దొంతర్లను పోగుచేసుకుంటూ కలంపట్టుకొని
కాగితం మీద అక్షర దొంతర్లను ఏర్చికూర్చి, పేర్చి కవిత
వ్రాయాలనుకున్నాను.

ఏమని వ్రాయను? ఎలా వ్రాయను?
దీపం పవిత్రతను నాశనం చేస్తున్నారని...
దీపం ఆర్పి ప్రమాణం చేసే వారిదివరకు...
కానిప్పుడు ప్రమాణం చేసి దీపాలార్పుతున్నారని
వ్రాయనా? ఏమని వ్రాయను?
కరకుతనానికి భయపడి వెలుతురు చీకటిని
కౌగిలించుకుందని వ్రాయనా?
ఉగ్రవాదం జీహాద్ ముసుగులో శవాల వ్యాపారం
చేస్తోందని వ్రాయనా?
ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నాను.
కళ్ళుతెరచి చూస్తే గౌతమి ఒడ్డుకు శవాలు..
కొట్టుకువస్తున్నాయ్..
అంతే నా చేతిలోని కలం జారిపోయింది.
ఈ చరిత్ర రక్తం సిరాతో వ్రాయాలేమో?

*(2008 కర్నాటి లక్ష్మీనరసయ్యగారు హనుమంత గ్రంథాలయంలో నిర్వహించిన పోటీలో బహుమతి పొందింది)*



# సర్వధారి ఉగాది

అందమైన ప్రకృతిలోకి అరుదెంచిన సర్వధారి ఉగాది
అందుకో నా కవితాక్షర హారతి
నవ వసంత శోభలో అరవిరిసిన సుమాల
సుపరిమళాలు గుబాళించువేళ
కోయిల రాగాలాపన హేలలో
నీకందిస్తూన్నానా హృద్యంగ హారతి
నా ఊహలకు - ఊపిరికీ
నా ఆశలకూ - ఆలోచనలకూ
రూపంయిస్తూ అరుదెంచిన ఉగాదీ
నీకందిస్తూన్నా శుభహారతి
వలసపిట్ట వచ్చీరాగానే నీకు శుభ స్వాగతం పలుకుతోంది
కుహలానందంతో స్వాగతిస్తోంది
సుమసౌరభాలు వెదజల్లే
లతానికుంజాలు...
మిలమిల లాడుతున్న నక్షత్ర మాలికలు
అన్నీ నీలో భాగాలే అవన్నీ నాలో భావాలే
నా భావాల కక్షరరూపమిచ్చి నా హృదయ
దివ్వెతో నీకందిస్తూన్నా నా కవితాహారతి

# మహతీ కళాసంస్థకు వ్రాసిచ్చిన కవిత

మహతీ ... ఓ మహతీ...
మహతీ... కళా సరస్వతీ
సంగీత భారతి - కవితా స్రవంతి

1. స్వరఝరీనాదాలు
కవనకేళీవాదాలు
ఆ పాత మధురాలు
సమ్మోహ భరితాలు ॥మహతీ॥

2. కళలకు కాణాచి మన కాకినాడ,
కమనీయ రాగాలు వినిపించువాడ
కవితా కుసుమాలు వికసించుఈడ
నటులు నటియించు ఈ చల్లని నీడ ॥మహతీ॥

3. కులమత భేదాలు కళల కతీతాలు
రసగంగలో తేలు మధుర హృదయాలు
నవపారిజాతాలు - మన కళాజాతాలు
మహతి మహిమాన్వితాలు - సుమధుర గీతాలు ॥మహతీ॥

*(2006 లో సంస్థ వ్రాయించుకున్న గీతం)*



# తస్మాత్.... జాగ్రత - జాగ్రత

తడబడుతూన్న నా అడుగులు తప్పతాగీ కాదు..
గుండెపోటుతోనూకాదు...
హృదయంలో మొలకెత్తి మెదడులోకి విస్తరిస్తూన్న...
మహోద్వేగ భూకంపం... అదే బాలికా భ్రూణహత్యోదంతం విని
క్షేత్రాన్ని ఛిద్రం చేస్తూంటే పంట ఎలా పండుతుంది?
భ్రూణహత్యలు చేస్తూపోతే కడుపు ఎప్పుడు పండుతుంది?

చెట్టుకు కాయ భారం కాదుకదా!
అడుసుతొక్కి కాళ్ళు కడుక్కోనంటే
కాళ్ళు కడిగి కన్యాదానం చేసిన పెద్దలకిచ్చే సమాధానం ఏమిటి?

సృష్టికి మూలం స్త్రీయే కదా!
స్త్రీ మనుగడ ప్రశ్నార్థకమైతే... భావి తరం కూడా ప్రశ్నార్థకమే
కంటే కూతుర్నే కను... ఆడపిల్ల యింట్లో తిరుగుతూంటే
మహలక్ష్మి నట్టింట నడయాడుతుందనేవారు ఆనాడు

మరీనాడు...
ఆడపిల్ల పుట్టి పెద్దైతే ఆడపిల్లేకాని...
ఈడపిల్ల కాదుకదా అనంటున్నారు.
మమతానురాగాల్ని పెంచి.. పంచేది కూతురే
భ్రూణహత్య కిష్టపడని అభాగ్యురాలు
తనకడుపు పంట కళ్ళారా చూసుకోవచ్చని
పగటి కలకంటుందే కానీ..

భర్త వేధింపులు భరించలేక తలొగ్గి...
మౌనరోదనతో బల్లెక్కుతుంది.

అలాకాదు ఎదురుతిరగాలి
మాతృత్వంతోనే స్త్రీకి పరిపూర్ణత సిద్ధిస్తుందికదా!

గర్భస్థపిండం బాలికని ముందే చెప్పే..
స్కానింగ్ మహమ్మారి కొందర్ని ఆవహించి
భ్రూణహత్యలు చేయిస్తూ
ఇంగితాన్ని కబళిస్తోంది.

పరోక్షంగా వైద్యుడు కూడా బాధ్యుడే
మానవత మనుగడకిది గొడ్డలిపెట్టు
తస్మాత్ జాగ్రత - జాగ్రత



# అక్షరాస్యత (వచన కవిత)

అక్షర జ్ఞానం లేని నిరక్షర కుక్షుల పాట్లు
అనుక్షణం కోకొల్లల అగచాట్లు
చదువులేని ఓ ఎల్లన్న పుల్లన్న కొండలు కరిగించి
ఆకండల్లోని రుధిరాన్ని మరగించి
కామందుకింకో అంతస్థు నిలుపుతాడు.

కొవ్వొత్తిలా కరిగిపోతూ ఆ అంతస్థును వెలుతురులో నింపుతాడు
వెట్టిచాకిరీ పిశాచి దంష్ట్రాల్లో నలిగి
తరతరాలు బానిసలుగా మిగిలి శుష్కించటం ఖాయం.

ఇంతకంటే శునకమే నయం అని కుమిలిపోతాడు
అందుకే ఓ నిరక్షరకుక్షీ! చదువుకో...
ఇకనైనా జీవితాన్ని సరిదిద్దుకో...

# యువతరం - నిరుద్యోగ సమస్య

కాలేజీలు కార్ఖానాలై నిరుద్యోగుల్ని వుత్పత్తి చేస్తుంటే...
ప్రభుతకు జటిల సమస్యగా మారి తలనొప్పి కలిగిస్తూంటే
యువత నిరాశా నిస్పృహలే ఉచ్ఛ్వాస నిశ్వాసాలై
నిర్వీర్యతగా మిగిలిపోతోంది.

ఈ జటిలత్వానికి కారణం తెలియక..
యువత గుండెలో ఆరని మంటై రగులుతోంది
మెరిట్‌కు విలువ తగ్గిపోతోంది
మేధస్సుకు పదును కగ్గిపోతోంది.

పచ్చనోట్లు రెపరెపలు స్పిరిట్‌లాంపులా వెలిగిపోతూంటే
దేశం ఎలా పురోగమిస్తుంది?
కాలచక్రం ఎలా పరిభ్రమిస్తుంది
తీవ్ర వాద ధోరణి ఎక్కువౌతూంది.

దారితప్పిన యువత సమాజానికి ప్రతిబంధకమౌతుంది
అలాగైతే ఈ భరతావని నిర్జీవమౌతుంది
ప్రపంచ పటం నుండి మాయమౌతుంది.
తస్మాత్... జాగ్రత.. జాగ్రత.



# "ముడుచుకున్న రెక్కలు విప్పండి"

అసందర్భ సన్నివేశమే కావచ్చు అయినా గాయాల్ని లెక్కిస్తున్నాను
నా దేశవ్యాప్తంగా పేలిన మందుపాతర్ల
మానుపుండ్లను లెక్కిస్తున్నాను.

రాత్రింబవళ్ళు మునివేళ్ళ ముళ్ళపై నిలబడి రక్షకభటుడు...
కన్నుమూసి తెరిచేలోగానే ఒక విధ్వంస విన్యాసం
ప్రాయోజిత ఉగ్రవాద ఉరుముల భీభత్సం
కుట్ర లెక్కదైనా కావచ్చు.

నిలువెల్లా మంటలంటుకున్న రైల్లోనే కత్తివేటుకు
తెగిపడ్డ మైనారిటీ కుటుంబంలోనో...
ఎక్కడైతేనే సారాంశం మాత్రం ఒక్కటే,
మతాలన్నీ ఒకటికాదనీ.

నాగాయాలంటే కుర్చీ నాలుగు కాళ్ళకు అవ్యాజమైన ప్రేమ
అనునిత్యం అగ్నిగుండం ఒకటి వెలుగుతూంటే...
కురవని మేఘాలను సృష్టిస్తూంటాయ్.

అగ్నిమాత్రం ఆరదు. ఆగర్భ శతృత్వం ఆగదు
పగటి వేష పర్యటనలకు రాలిపడిన ప్రజాభిమానమెంత?

గౌరవశాంతి, సద్భావన, ఓదార్పు, సస్యశ్యామల రథయాత్రల్లో
పోగైన సానుభూతి ఎంత?
సమయమంతా సమీకరణతోనే సరి.

అంకానికో ఏడాది అయిదంకాల నాటకాన్ని ఎలా రక్తి
కట్టించాలన్నదే అసలు సమస్య
తమలపాకుతో ఒకరు
తలుపుచెక్కతో ఒకరు
ఎటొచ్చీ నిర్మాణ సూత్రాల గురించే ఎవరూ ఘోషించుకోరు
ఏ ఒక్కరిలోనూ ఎర్రరక్తకణాలు కనిపించవు.

ఎలాగైతేనే వేదిక నెక్కటం వేషం కట్టడమే ఏకైక లక్ష్యం
పునాదుల్ని లోతుగానే తవ్వుకుంటాం
పిల్లర్లను పటిష్టంగానే నిర్మించుకుంటాం
పూర్తైన నిర్మాణాలు ఆకాశానికి నిచ్చెన్లు వేస్తాయ్.

కంప్యూటర్లకు రెక్కలు కట్టుకొని డాలర్ల ముంగిట్లో వాల్తాయ్
ఇక్కడ కమ్మిన మేఘం విదేశాల్లో వర్షిస్తుంది!

జన్మభూమి దేహం మాత్రం ఎడారి నోటితో ఆవులిస్తుంది
కరువు భూతం గజ్జెకట్టి వరికంకులవెన్ను విరుస్తుంది
ఇప్పుడు నీరు కూడా రంగూ, రుచీ, వాసన గల పదార్థమే
నదులు కూడా ఆస్తి పంపకంలో భాగాలే
ఈదేహాన్ని మోస్తున్న ఒకానొక మనిషి
కబేలాకు తరలుతున్న మూగజీవంలా
తలొంచుకుని నడుస్తూనే వుంటాడు
శిథిలమౌతున్న నాగరికతకు సాక్షులు మీరు
ముడుచుకున్న రెక్కలు విప్పండి.



ఇకనైనా ముళ్ళమీద పాదాలు శాంతి సమయ శిబిరాల్లో
గులాబీలై విరియాలి.

వికృతంగా నర్తిస్తూన్న మారణాయుధాల తలలు బద్దలు కొట్టాలి
మనకిక అణ్వస్త్రాల ఆయుధ భాండాగారాలు వద్దు
అన్నంపెట్టే ధాన్యాగారాలు కావాలి.
పల్లె పల్లెకూ బీటీరోడ్లు వద్దు
పత్తిరైతుకు ఊతంకావాలి
పొలాల నిండా పరవళ్ళు తొక్కే జలధారలు కావాలి.

ఇంటింటా ఇంటర్నెట్లు వద్దు
కరువు ఛాయలు సోకని భరోసా కావాలి
ఈ నేల సమస్తం వెలుగుతో పొంగిపొరలే కాంతి ధారలు కావాలి
ఇకనైన ముడుచుకున్న రెక్కలు విప్పండి.

# తూర్పుగోదావరి జిల్లా సంస్కృతీ వైభవం

**(రాగమాలిక)**

గోదావరి తూర్పు దిక్కునా వెలిసిందీ మనజిల్లా
ఉన్నత సంస్కృతి విలువలతో మెరిసిందీ బహురమ్యంగా
నన్నయ్య భారత కుసుమ మిక్కడే వెల్లివిరిసింది
మన సంస్కృతి ఉన్నతి జగతి కప్పుడే తెలిసిందీ

1. కందుకూరీ - రఘుపతి బ్రహ్మర్షి సంస్కర్తలుగా వెలిశారు
దురాచార నిర్మూలనకై నడుబిగించీ కదిలారు
దుర్గాబాయి - బులుసు సాంబమూర్తి
దేశ సేవలో మునిగితేలి నడుంబిగించి కదిలారు

2. ద్రాక్షారామ - అన్నవరాలు భక్తుల పాలిట వరాలు
కొమరా రామ - భీమారామ భక్తుల పుణ్యక్షేత్రాలు
ధాన్యపుగాదె మన జిల్లా సరార్థర్ కాటన్ కృషివల్ల
పసిడి పంటలు పండేను అందరికడుపులు నిండేను

3. మన్నెపు వీరుడు అల్లూరి తెల్లదొరలనెదిరించి ఇక్కడే నేలకొరిగినాడు

4. ఆదుర్రు - కోరుకొండ ఆనాటి వైభవ బౌద్ధారామాలు
పూతరేకులు - కాజాలు కోనసీమలో కొబ్బరి తోటలు
కడియంపూలగుబాళింపులో మన కీర్తి వ్యాపించు

5. పద్యమల్లెజంట కవులు తిరుపతి వేంకట కవులు
హాస్యానికి భాష్యం మొక్కపాటి బారిష్టర్
డొక్కా సీతమ్మ ఆకలి తీర్చిన అమ్మ
అన్నపూర్ణమ్మ - మన అన్న పూర్ణమ్మ

6 కళలకు కాణాచి తూర్పురేఖ
వేదఘోషకిది వేదిక ఘనతను చాటే గోదావరి గలగలలూ
ఉప్పొంగే సాగర అలల ఘోషలు ॥గో॥



# జనాభా విద్య

అర్ధ శతాబ్ది మాట చెప్పుకోవాలంటే...
సంతానం కలిగేకొద్దీ సంబరం పెరిగేది.
కుటుంబంలోని వారందరికీ సంబరం...
ఇంకో కొత్త సభ్యుడు చేరుతున్నాడని
పెళ్ళవగానే ఆడపిల్లని దీవించేవారు...
'శీఘ్రమేవ సంతాన ప్రాప్తిరస్తు' అని
అధిక సంతానం ఆనందానికి తొలిమెట్టు ఆనాడు
కారణం కుటుంబ పోషణభారం - భారంగా ఉండేది కాదు
ఈనాడు అన్నీ తేడాలే
దీవెనలో కూడా మార్పే
"నాలుగేళ్ళపాటు సుఖంగా ఉండు సంతానం వద్దు'
అని అంటున్నారు

నిజమే మరి
'అధిక సంతానం దుఃఖానికి మూలం'
దేశం పురోగతి చెందాలంటే...
ఉన్న వాళ్ళను తీర్చిదిద్దితే చాలు
అదే బంగారు భవితకు ప్రగతిజాలు

# మనసు విలువ

మనిషికే కాదు మనసున్నది
సృష్టిలో జీవరాసులన్నింటికీ...
మనిషి రాజీ పడతాడు మనసుతో...
అందుకే సమస్యల సుడిగుండంలో చిక్కుకుంటాడు
మనసుతో రాజీపడిన జంతుజాలం మూగజీవులై
జీవనం సాగిస్తున్నాయ్!

మన సుకవి - మనసు కవి ఆత్రేయ అన్నట్లు
మనిషికి మనసే శిక్ష - ఇది నిజం
మనసు విలువ తెలిసిననాడు
మనుగడ సాఫీగా సాగిపోతుంది.

మనిషి ఆ విలువ లాక్కొంటే
సుడిగుండం మధ్య చిక్కుకుంటాడు.
మనిషి + మనసు విలువ = మనీషి
మనిషి - మనసు విలువ = దానవుడు



# సంఘ సంస్కర్త... జాషువా

పంచాక్షరీ జపంతో శివుని ఆరాధిస్తారు
పంచామృతాలతో దైవాన్ని అభిషేకిస్తారు
పంచాగ్నులకు హోమం చేస్తారు
పంచ భూతాలను ఆరాధిస్తారు
పవిత్రమైన ఈ పంచమ సంఖ్య కలిగివున్న..
పంచములైన మమ్మల్ని దూరంగా నెట్టివేసి..
అనేక అవమానాలకు గురిచేశారు.
ఇది న్యాయమేనా? అని ప్రశ్నించిన ధైర్యం జాషువా సొత్తు
అందుకే రానురాను పంచములు అనే పదాన్ని
దళితులుగా మార్చేరు.
దుర్భర జీవితాలననుభవించిన దళిత లోకానికి...
ఆశాజ్యోతిగా వెలిగాడు గుర్రం జాషువా!
సమ సమాజమేకాదు - నవ సమాజం కోరిన జాషువా
జీవితాంతం వరకూ పోరాడేడు.
ఇందుకోసం తలక్రిందులయ్యాడు గబ్బిళంలా!
జైలుకు వెళ్ళడానికి సిద్ధపడ్డాడు ఫిరదౌసిలా!
కామందుకాళ్ళు కందిపోతాయని చెప్పులు కుట్టియిస్తే...
ఆ చెప్పులు కుట్టియిచ్చినవ్యక్తినే ఆ చెప్పుకింద అణగదొక్కేడు.
అహం చూపిన దురహంకారుల్ని ఏవగించుకున్న జాషువా...
చూపేడు తేకువ.

కలం బలం చూపి అక్షరాయుధంతో
నిర్భీతిగా నెదిరించి సంఘం కుళ్ళును
కడగడానికి ప్రయత్నించిన జాషువా..
కవి రూపంలోవున్న 'సంఘ సంస్కర్త" అనటంలో
సందేహమెందుకు?

## నహిజ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే

2001లో **మిలీనియం పబ్లిక్‌స్కూల్** ను ప్రముఖ వ్యాపారవేత్త **శ్రీ పాలిక వేంకట దుర్గాప్రసాద్**గారిచే స్థాపించబడినది. ఆనాటి నుండి ఈనాటి వరకు ప్రతీ సంవత్సరం 10వ తరగతి విద్యార్థులందరు 'ఎ' గ్రేడ్‌లో ఉత్తీర్ణులవ్వుతున్నారు.

నగరంలో మొదటగా ఎ.సి. క్లాసురూములు ప్రారంభించిన స్కూల్ ఇదే.

అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం కలిగివ్వున్న ఈ స్కూలు **శ్రీమతి పి. మహారాణి** (కరస్పాండెంట్ - సెక్రటరీ) గారి పర్యవేక్షణలో క్రమశిక్షణతో నడపబడుతూన్న స్కూలని ప్రఖ్యాతి పొందినది.

మాగురువ్వుగారు (గరికిపాటి మాస్టారు) కవితా సంకలనం ఆవిష్కరించే సందర్భంలో మా శుభాకాంక్షలందిస్తున్నాం.



**పాలిక వేంకట దుర్గాప్రసాద్**
చైర్‌మెన్

**శ్రీమతి పి. మహారాణి**
కరస్పాండెంట్ - సెక్రటరి

మరియు

**ఉపాధ్యాయ బృందం - కాకినాడ.**




**2012 సెప్టెంబర్ 27వ తేదీన శ్రీ గుర్రం జాషువా 117వ జయంతి సందర్భంగా హైదరాబాద్, జూబ్లీహిల్‌లో సన్మానం చేసిన దృశ్యం**




**2012 ఏప్రిల్ 16వ తేదీన అల్లూరి సీతారామరాజు కళావేదిక వారు కాస్మాపొలిటన్ క్లబ్‌లో 'నటప్రజ్ఞ' బిరుదుతో సన్మానించిన దృశ్యం**

# స్వపరిచయం



- పేరు : **గరికిపాటి సూర్యనారాయణమూర్తి**
- వ్యావహారిక నామం : గరికిపాటి మాస్టారు
- జననం : పిఠాపురంలో 1932
- జననీ జనకులు : రామలక్ష్మి – సత్యనారాయణమూర్తి
- మాతామహులు : పిఠాపురం రాజాస్థాన కవులు కీ॥శే॥ పండిత పెండ్యాల వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. నాకు సాహిత్యాభిరుచి కలగడానికి ముఖ్య కారకులు
- నేను 1958 నుండి 1992 వరకు కాకినాడ కార్పొరేషన్ హైస్కూల్‌లో తెలుగు భాషా పండితునిగా పనిచేసినాను.
- **రంగస్థలం :** కాకినాడలోని ప్రముఖ నాటక సంస్థ ది ఎంగ్మెన్స్ హాపీ క్లబ్బులో మెంబరుగా నుండి 800 నాటకాలలో విభిన్న పాత్రలు పోషించినాను.
- 2009లో నంది నాటకోత్సవాలలో పాల్గొని నంది బహుమతి పొందినాను.
- 1960 నుండి కవి సమ్మేళనాలలో పాల్గొంటు కవితలు వ్రాస్తున్నాను.
- కొన్ని కవితలకు అవార్డులు పొందినాను.
- 2012 రంగస్థల దినోత్సవం రోజున అవార్డు పొందినాను.
- **"నానా సూన వితానం'** అనే ఈ ప్రథమ కవితా సంకలనం జ్ఞానపీఠ అవార్డు గ్రహీత పద్మవిభూషణ్ ఆచార్య సి. నారాయణరెడ్డిగారి అమృత హస్తాలుమీదుగా కళాశారద సాహితీ సాంస్కృతిక సంస్థ ద్వారా ఆవిష్కరించాలని తపన.

భవదీయుడు

గరికిపాటి సూర్యనారాయణ మూర్తి

96403 63324

SLG - 939 1616 774